స్కెచ్

# పెళ్లికొడుకు ప్రార్థన

"అశోక్"

సరిగ్గా యివాళకి వారమయింది. ఆదివారం సెలవే కదా అని మాఊరు బయలుదేరి వెళ్లాను. ఇంటికి వెళ్లాలంటే అసలు నాకు ప్రాణసంకటమే. ఎందుకంటే వెళ్ళి కాళ్ళన్నా కడుక్కోకముందే మొదలుపెడ్తారు మా అమ్మా నాన్నా, 'పెళ్ళిపాట.' ఒక సంవత్సరంనుంచి 'అబ్బాయికి పెండ్లిచేయాలి' అనే పిచ్చి పట్టుకుంది మా వాళ్ళకి. ఇరవైనాలుగ్గంటలూ, మూడువందల అరవైఅయిదురోజులూ వాళ్ళకు యీ 'పిచ్చి' తప్ప మరొక వ్యాపకంలేదు.

"ఎల్లమ్మగారమ్మాయి బాగుంది. సంప్రదాయం కూడా మంచిది" అని అమ్మ ప్రపోజ్ చేస్తే "పుల్లయ్యగారి సంబంధం అన్నిటికంటె మంచిది, ఆయన పలుకుబడిగల పెద్దమనిషి" అంటాడు నాన్న.

'సంప్రదాయం' అంటూ అమ్మ గోల. 'పలుకుబడీ, గౌరవం' అంటూ నాన్న గోల. పెళ్ళికూతురు చదువుకుందో లేదో అందమైనదో కాదో ఎఱుపో-నలుపో, వాళ్ళు పట్టించుకున్న పాపానపోరు. వాళ్ళకేం? మెడకుకట్టి ఒకబండను, "నీ చావు నువ్వు చావరా!" అంటారు. బ్రతికున్నంతకాలం అలో లక్ష్మణా అని ఏడ్చేది నేనేగా? మొత్తంమీద ఆ రెండు పెద్ద ఘటాలకీ సమాధానం కుదరకపోతూండటంవల్ల నాకు పెద్ద ప్రమాదం ఉండేది కాదు.

ఈసారి పెళ్ళిసంబంధంమటుకు నా పీకమీద కొచ్చింది. అమ్మా నాన్నా ఏకగ్రీవంగా ఒక సంబంధం బాగుందనుకున్నారు. మాఘమాసంలో ఆ "మూడుముళ్లూ" వేయించి చేతులు దులుపుకుందామని సంబరపడ్డారు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక పడక కుర్చీలో కూర్చొని చదువుకుంటున్నాను. పాఠాలుకావు, పాతపత్రికలు. అమ్మా నాన్నా సంయుక్తంగా 'లయ' కలిపి మొదలు పెట్టారు యీదఫా:

"ఏంరా, మేమూ ముసలివాళ్ళమైపోయాం!" ఇది కొంతవరకు అంగీకరించతగ్గ విషయమే.

"సంబంధాలు వస్తున్నయ్. నీకు పెండ్లీడు వచ్చింది." వస్తున్న మాట కూడా యథార్థమే. మైనారిటీ తీరి సంవత్సరమైంది కాబట్టి పెళ్ళియీడు వచ్చి ఉండవచ్చు.

"పుట్టగుంట పరంధామయ్యగారి అమ్మాయిని చేసుకుంటే నాలుగువేలు కట్నం యిస్తారుట. కాస్త మడీ ఆచారం, పూజా పునస్కారం— తెలిసిన కుటుంబం. సంప్రదాయం కూడా మంచిది." ఈ ధోరణి మాత్రం సబబుగాలేదు. పూర్తిగా పురాణకాలం నాటి వ్యవహారంలా వుంది. అది కాకపోయినా ఈ మడీ-ఆచారం అంటూ అఘోరించే "బొమ్మ"ను కట్టుకుంటే యిక నేను దానితో సుఖపడ్డట్లే! సాయంకాలం షికారు కెళ్ళామంటే "రామరామ" అనుకునే ఘటం కాబోలు!

"తెల్లవారు ఝామున నాలుగు గంటలకే లేస్తుందిట." చచ్చాము దేవా! ఏడు గంటల దాకా నాకు మెళకువ రాదుగదా! ఇక మాకిద్దరికీ పొత్తెట్లా కుదురుతుంది?

"నాలుగు గంటలకే స్నానం జపం పూర్తి చేసుకుంటుందిట." అనారోగ్యం! అనారోగ్యం! ఇంకెప్పుడూ చీదుకుంటూరొజుకుంటూ ఉంటుంది కాబోలు. ఈ కరువుకాలంలో మందూ మాకూ ఎక్కడ యిప్పించగలం?"

"ఇంటెడు పనీ చేస్తుందిట ఓపిగ్గా. మీఅమ్మను సుఖపెట్టినట్టవుతావు. పిల్లాజెల్లాతో చాకిరీ చేసుకోలేకుండా ఉంది" నాన్నగారి సలహా.

ఇంతకీ నేను ఆ "ఇంతి"ని కట్టుకోవటం చాకిరీ కోసమన్నమాట. ఇక దాసీదాన్ని కూడా మాన్పించవచ్చు. ఇంటెడు పనీ చేస్తుందిట! అంటే బాగా కసరత్తు చేసిన కండ శరీరం! రేపు కాస్త కోపం వచ్చి, అర్ధాంగి కదా అని అదమా

యిస్తే దేహశుద్ధి చేయగల సమర్థురాలు! ఇంత బ్రతుకూ బ్రతికి ఆడదాని చేత తన్నులు తినాలి! హతోస్మి!

“నువ్వు ఒప్పుకుంటే ఇల్లరికంకూడా ఉంచుకుంటారుట!” పెద్ద పాలేరులాగా?

“మేమేమో కాటికి కాళ్ళు చాచుకుని వున్నాం!”

శుద్ధ అబద్ధం! నాలుగైదు పుష్కరాలు పైబడ్డ మాట నిజమే కాని కాటికికాళ్ళు చాచిన మాట అబద్ధం. ఈ రోజుల్లో వయస్సునుబట్టి చావు నిర్ణయించటానికి వీలులేదని, పాతికేండ్లు నిండని ముగ్గురు పేషెంట్లకు మూడు నిమిషాల్లో టిక్కెట్లిచ్చిపంపిన, ఒక ప్రముఖ వైద్యశిఖామణి మొన్న పునరుద్ఘాటించాడు.

“మన ఊరిదగ్గర సంబంధం. దూరాభారమైతే ప్రయాణాలకు యాతన.”

తస్సాదియ్యా! కాస్త హెచ్చు తగ్గు వస్తే తేలిగ్గా పుట్టింటికి వెళ్ళిపోవచ్చు, బస్సు చార్జీలు దొరక్కపోయినా! ఇక సంసారం సాగినట్టే!

“నలుగురు బావమరదలున్నారు. అంతా మనబలగం చేదోడువాదోడుగా ఉంటారు.” వీసమెత్తు మాట మిగిలినా వీపు విమానంమోత ఎత్తించటానికి. అసలే బక్కవాణ్ణి!

“వాళ్ళకు పది ఎకరాల మాగాణీ కమతం ఉంది. ఇల్లరికం వెళితే దానిమీద పెత్తనం అంతా నీదే” వెట్టిచాకిరీ చేతినిండా దొరుకుతుందన్న మాట.

“పెళ్ళికూతురికి పరంధామయ్యగారు సంగీతం నేర్పిస్తున్నాడు.” ఇహఇంట్లో నిశబ్దంగాకూర్చొనే ప్రాప్తం ఉండదు. చెవులు గుల్లపడిపగవాల్సిందే.

“మంచి చురుకైన పిల్ల” అడపా దడపా మొగుడి పిలక ఝాడించటానికి.

“పరంధామయ్యగారు కూడా పెద్దమనిషే కాని మరోరకంకాదు.” వివాహాలు యింకా తెలియవు.

“ఆయన కాంగ్రెసు నాయకుడుకూడా. రేపు ఉద్యోగం సద్యోగం కావాలన్నా, బస్సుర్రూట్లు పర్మిట్లూ, లేవాలన్నా పలుకుబడి కలవాడు.”

అలా అయితే ఆయన “పెద్దమనిషి” అనే మాట అక్షరాలా నిజం.

“ఆయన పేరుచెప్తే పుట్టగుంటలో నీళ్ళు తాగరు!” పెళ్ళియినప్పటినుంచీ మన మూ అంతే!

“పిల్ల కాస్త బాగుండకపోయినా అన్ని విధాలా తగిన సంసంధం. ఏరా మొద్దులాగ మాట్లాడంవే. అందంగా వుండకపోతే ప్రాణం పోతుందా. అందాన్ని కొరుక్కు తింటావా? కాస్త నలుపే అనుకో... అయితే అటువంటి సంప్రదాయం గల సంబంధం దొరుకుతుందా వెయ్యి జన్మాలెత్తినా? నేను ఆపెళ్ళి చేసేతీర్తా. మొన్ననే ఖాయపర్చుకున్నా.” గర్జించాడు నాన్న.

“ఓ మాయదారి దేముడా! చివరికి ఆబ్రహ్మ రాతుసిని నాకు కట్టపెట్ట బోతున్నావా. వద్దు, పరమేశ్వరా! దీనబంధూ! నేనేం పాపంచేశాను. ఆ అమ్మాయికి పళ్ళుకూడా ఎత్తు అని విన్నాను. గయ్యాళి గంపట. మా నాన్న చెప్తే వినేఘటం కాదే! ఓ నెహ్రూ! నువ్వన్నా నా మొఱఆలించు. ఈ పెళ్ళి జరగకూడదని ఇంజంక్షన్” జారీ చేయించు. ఈ పని నువ్వే స్వయంగా చేయాలి. ఏ ఛోటా నాయకుణ్ణో పంపిస్తే వాళ్ళని భరించే శక్తి నాకులేదు. కనీసం టీపార్టీ కూడా చేయలేను.” అంటూ బావురుమని నాలోనేను ఏడ్చి, “సరే. మీ యిష్టమే నా యిష్టం నాన్నా” అన్నాను.

---

పట్టణంలో పేరుమోసిన వైద్యుడు కొన్నాళ్లు ఎక్కడికేనా వెళ్లి విశ్రాంతి తీసుకో నిశ్చయించి, తన “ప్రాక్టీసు” భారం అంతా క్రొత్తగా డాక్టరీ చదివిన కొడుక్కి అప్పగించాడు. నెలరోజులు విశ్రాంతి తీసుకుని తిరిగివచ్చి, విశేషాలేమిటని కుమారుణ్ణి అడిగితే, తను కుదిర్చిన కేసులు గురించి గర్వంగా చెప్తూ, “నాన్నా, జమీందారిణీగారి అజీర్ణ వ్యాధి కుదిర్చేశాను.” అన్నాడు.

తండ్రి “మంచిది నాయనా! అయితే ఆమె అజీర్ణమే నీ కాలేజీ చదువు ఖర్చు యిన్నాళ్లూ యిచ్చుకుంది!” అని నిట్టూర్చాడు.